andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.7 / కనిష్ఠం 19.5
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 4 జూలై 2025





లింగంపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

లింగంపల్లిలో అభ్భివద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉంది

● ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

సదాశివనగర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): లింగంపల్లిలో గ్రామంలో రూ.2.40 కోట్ల నిధులతో మిషన్ భగీరథ బల్క్ నీటి కనెక్షన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. గురువారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. సకల సదుపాయాలతో టీజీఐఐసీని ఏర్పాటు చేసుకుంటున్నామని, ఇప్పటికే ఒక కంపెనీని తీసుకొచ్చానని అన్నారు. మరిన్ని కంపెనీలతో సైతం మాట్లాడుతున్నానని, ఈ కంపెనీ రావడం వల్ల మన నియోజకవర్గంలోని యువత 4 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఎన్నోసార్లు జాబ్‌మేళాలు పెట్టి యువతకు ఉపాధి కల్పించానని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులకు రూ.23కోట్ల నిధులను మంజూరు చేయించానని, కాళేశ్వరం నిర్మాణ పనుల్లో భాగంగా భూంపల్లి, మోతే, కాటేవాడి జలాశయాల నిర్మాణాలకు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌తో, చీఫ్ ఇంజనీర్‌తో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న వాటిని క్లియర్ చేయించానన్నారు. ఆర్థికశాఖ నుంచి ఫైనల్ అప్రూవల్ వస్తే జలాశయాల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందే విధంగా ప్రభుత్వంతో మాట్లాడటం జరుగుతుందని, భూములు కోల్పోయిన రైతుల వివరాలతో రిపోర్ట్ తయారు చేసి ఒక వారంలో అందించాలని తహసీల్దార్ సత్యనారాయణను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఏఎంసీ ఛైర్మన్ సంగ్యానాయక్, నాయకులు లింగాగౌడ్, సంపత్‌గౌడ్, మద్దెల బాగయ్య, రూపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్లు వసూలు చేసిన పోలీసులు

● ఒక డ్రంకెన్ డ్రైవ్, 300 వాహనాల తనిఖీ

లింగంపేట, జులై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్తాపూర్ వద్ద గురువారం స్పెషల్ పార్టీ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. రూ. లక్ష వసూలు చేసినట్లు ఎస్సై వెంకటరావు తెలిపారు. 300 వాహనాలను తనిఖీ చేసి సరైన వాహన పత్రాలు, హెల్మెట్ లేకుండా తిరుగుతున్న వాహనదారులు 25 మందికి జరిమానాలు విధించినట్లు ఆయన తెలిపారు. ఒక డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్స్ కనకయ్య, శ్రీనివాస్, కానిస్టేబుల్స్ రాజు, జయ్, లక్ష్మణ్, రవి, మదన్‌లతో పాటు స్పెషల్‌పార్టీ పోలీసులు ఉన్నారు.

ఎస్పీ కార్యాలయం



పోలీసు శాఖలో ప్రక్షాళన



రాజేష్‌చంద్ర, ఎస్పీ

- జిల్లాలో 10 మంది ఎస్సైల బదిలీలు
- 8 మందికి పోస్టింగ్.. ఇద్దరు ఎస్సైలు వీఆర్‌లోకి
- ఇందులో కొందరిపై అవినీతి, అక్రమాల ఆరోపణలు
- భూ తగాదాలు, ఇతర కార్యక్రమాల్లో తలదూర్చుతున్నారని ఫిర్యాదులు
- ఈ నేపథ్యంలోనే పెద్దమొత్తంలో ఎస్సైల బదిలీలు
- ఇటీవల నిర్లక్ష్యం వహించిన పలువురు ఎస్సైలు, సిబ్బందిపై వేటు
- ఇప్పటికే హోంగార్డులు, కానిస్టేబుళ్ల బదిలీలు
- మరో ఇద్దరు, ముగ్గురు సీఐలపైనా అవినీతి ఆరోపణలు.. వారిపై బదిలీ వేటు పడేనా?
- పోలీసుశాఖలో తనదైన మార్క్ చూపుతున్న ఎస్పీ
- పలు కొత్త సంస్కరణలను తీసుకువస్తున్న ఎస్పీ

కామారెడ్డి, కామారెడ్డి టౌన్ (ఆంధ్రజ్యోతి), జూలై 3: పోలీసుశాఖ అంటేనే క్రమశిక్షణకు మారుపేరు అలాంటి శాఖలో క్రమశిక్షణ తప్పుతూ అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని నివారించేందుకు నాలుగు నెలల క్రితం వచ్చిన జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర పోలీసుశాఖపై తనదైన మార్క్ చూపిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌లను చుట్టేసిన ఎస్పీ అక్కడి సిబ్బంది పనితీరు, నడవడిక, ప్రజలతో వారు మెలుగుతున్న తీరును పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ విధుల్లో నిర్లక్ష్యం చూపుతున్న వారికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా అయితే బదిలీ లేదంటే సస్పెన్షన్ వేటు వేస్తున్నారు. దీంతో గత కొన్నేళ్లుగా పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కాలంటే అనేక రకాలుగా ఆలోచన చేసే ప్రజలకు ఓ భరోసా దక్కుతోంది. ఇప్పటికే హోంగార్డు స్థాయి నుంచి ఉన్నత స్థాయిలో ఉన్నవారికైన స్థాన చలనం కలిగించారు. ఇటీవల నిర్లక్ష్యం వహించిన పలువురు ఎస్సైలు, కానిస్టేబుళ్ల, హెడ్‌కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. గురువారం సైతం అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న, భూ తగదాలు, ఇతర కార్యక్రమాల్లో తలదూర్చుతున్న ఒకరిద్దరు ఎస్సైలతో పాటు ఇతర ఎస్సైలను సైతం బదిలీ చేయడంతో పోలీసుశాఖలో చర్చనీయాంశమైంది. ఒకేసారి పది మంది ఎస్సైలు బదిలీ కావడం ఎస్పీ పనితీరుకు నిదర్శనమని పోలీసు వర్గాల్లో చర్చ సాగుతోంది.

అవినీతి ఆరోపణలతోనే బదిలీలా?

తాజాగా జిల్లా పోలీసుశాఖలో 10 మంది ఎస్సైలను బదిలీ చేయడంపై చర్చనీయాంశంగా మారింది. ఈ బదిలీలకు కారణం పలువురు ఎస్సైలపై అవినీతి ఆరోపణలు, విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతోనే బదిలీలు చేశారని తెలుస్తోంది. బదిలీ అయిన వారిలో ఓ ఎస్సై భూ తగాదాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నాడని స్థానిక ప్రజాప్రతినిధి ఎస్పీకి ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సదరు ఎస్సైపై ఫిర్యాదు చేయడంతో తన ఆటలు సాగవని మరో పోలీసుస్టేషన్‌కు బదిలీ చేయించుకునేందుకు రాష్ట్రస్థాయిలో లాబీయింగ్ చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. అదేవిధంగా మరో ఎస్సై పేకాట కేసు విషయంలో సీజ్ చేసిన డబ్బులు కేసు కట్టే సమయంలో మొత్తం చూపలేదని, వడ్డీ వ్యాపారులకు వత్తాసు పలుకుతూ డబ్బులు తీసుకున్న వారిని ఇబ్బందులకు గురిచేశాడని సొంతశాఖలోని సిబ్బంది ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్పీ సీరియస్‌గా వ్యవహరించి వారిని ఆ స్టేషన్‌ల నుంచి స్థాన చలనం కలిగించారు. మరికొందరు ఎస్సైలు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండడంతో వారిని బదిలీ చేశారని, ఇతర ఎస్సైల సేవలు ఆయా స్టేషన్ పరిధిలో అవసరమని గుర్తించినట్లు తెలుస్తోంది.

గతంలో పలువురిపై సస్పెన్షన్ వేటు

జిల్లా ఎస్పీగా రాజేష్‌చంద్ర బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు కావస్తోంది. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులతో పాటు సిబ్బందికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా సస్పెండ్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో పది మందిపై ఎస్పీ కఠిన చర్యలు తీసుకున్నారు. తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు, రామారెడ్డి ఎస్సై రమేష్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో ఆయనపై ఉన్నతాధికారులకు రిపోర్టు చేశారు. దీంతో ఆయనను సస్పెండ్ చేశారు. వీరితో పాటు ఒక హోంగార్డు, ఐదుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. ఇలా విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు బాధితులు, ఫిర్యాదుదారులు నిందితుల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై జిల్లా ఎస్పీ కఠిన చర్యలు తీసుకుంటూ పోలీసుశాఖలో తనదైన మార్క్ చూపిస్తున్నారు.

సీఐలపై అవినీతి ఆరోపణలు.. బదిలీ వేటు పడేనా?

పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేయడంలో, భూ తగాదాల్లో, ఇతర కార్యక్రమాల్లో తమ పరిధికి మించి వ్యవహరిస్తున్న ఎస్సైలపై ఒకరిద్దరు సీఐలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం ఎస్పీ బదిలీ చేసిన ఓ సర్కిల్ పరిధిలోని ఎస్సైపై ఇలాంటి ఆరోపణలు అనేకం ఉన్నాయి. సీఐకు ఎస్సై వ్యవహారంపై వివరించినా తనకు పట్టనట్లుగా వ్యవహరిస్తుండే వాడని రాజకీయ వర్గాల్లోనే కాకుండా సామాన్య ప్రజానీకం చర్చించుకోవడం గమనార్హం. పోలీసుశాఖలో అధికారిక ఫోన్ నెంబర్లు ఉన్న సదరు సీఐ అసలు ఆ ఫోన్‌ను ఎత్తడని విమర్శలు ఉన్నాయి. పైగా అధికారిక ఫోన్ నెంబర్ ఎత్తకపోవడం ఏంటని ప్రశ్నిస్తే అంతా నా ఇష్టం అనే పద్ధతిలో వ్యవహరిస్తాడని ఒకానొక సమయంలో ఎస్సై, సీఐలు జంట వసూళ్లకు పాల్పడే వారని, ఇప్పటికీ ప్రతిరోజూ రాత్రి సదరు సీఐ సర్కిల్ కార్యాలయం వద్ద సెటిల్‌మెంట్లకు సంబంధించిన పంచాయతీలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక మరో సర్కిల్ పరిధిలో ఎస్సైలు విధుల్లో

(మిగతా 8వ పేజీలో)



బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

డబుల్ ఇళ్లకు తాళాలు వేయడం సరి కాదు

బాన్సువాడ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో డబుల్ ఇళ్లకు అధికారులు తాళాలు వేయడం సరికాదని గురువారం బీజేపీ నాయకులు బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో డబుల్ ఇళ్ల పొందిన లబ్ధిదారులు గత 5 సంవత్సరాలుగా నివాసం లేని వారి ఇళ్లకు అధికారులు తాళాలు వేయలేదని, కానీ వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిన వారి ఇళ్లకు అధికారులు తాళాలు వేయడం ఏంటన్నారు. ఈ విషయమై బీజేపీ నాయకులు డబుల్ ఇళ్లపై విచారణ చేపట్టాలని సబ్ కలెక్టర్ కిరణ్మయిని కోరగా ఆమె స్పందించి వెంటనే విచారణ చేపడతామని స్పందించారు. అనంతరం లబ్ధిదారులకు అధికారులు ఇళ్ల తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పైడిమల్ లక్ష్మీనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు కోనాల గంగారెడ్డి, మజ్జిగ శ్రీనివాస్, చిరంజీవి, ఉమేశ్ తదితరలున్నారు.



నెమలిలో వంగి ఉన్న విద్యుత్ స్తంభాన్ని సరి చేసిన విద్యుత్ అధికారులు

విద్యుత్ స్తంభాన్ని సరి చేసిన విద్యుత్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నసురుల్లాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): 'నిర్లక్ష్యపు నీడలో విద్యుత్ అధికారుల తీరు' అని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. గురువారం నెమలి గ్రామానికి చేరుకుని వంగి ఉన్న స్తంభాన్ని విద్యుత్ అధికారులు సరి చేశారు. ఈ సందర్భం గా గ్రామస్థులు మాట్లాడుతూ పడి పోవడానికి సిద్ధంగా ఉన్న స్తంభాన్ని సరి చేసిన విద్యుత్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.



న్యాయాధికారులను సన్మానిస్తున్న దృశ్యం

కాలభైరవ ఆలయంలో న్యాయాధికారుల పూజలు

రామారెడ్డి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డిలోని కాలభైరవ స్వామి ఆలయంలో గురువారం కూకట్‌పల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి గిరిజా, కామారెడ్డి సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగరాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్ఛరణలతో అభిషేకాలు, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి గురించి పురోహితులు వివరించారు. వారికి శాలువాలు, భైరవుని చిత్ర పటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బుర్ర ప్రభురాంచంద్రం గుప్తా రామారెడ్డి, రామారెడ్డి ఎస్సై రాజారాం, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, పురోహితులు మనీష్ శర్మ, పోలీసులు, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు

కామారెడ్డి టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సుల సౌకర్యం కల్పించామని డిపో మేనేజర్ కరుణశ్రీ తెలిపారు. మేడారం, రామప్పగుడి, వరంగల్ కోటా, భద్రకాళీ, వెయ్యి స్తంభాల గుడికి 40 సీట్లతో కూడిన డీలక్స్ బస్సు ఉదయం 6 గంటలకు బయలు దేరి ఉదయం 4 గంటల వరకు చేరుకుంటుందని తెలిపారు. దీనికి గాను రూ.1100 చార్జ్ ఉంటుందన్నారు. భద్రినాథ్ ఆలయం, బీర్లా మందిర్, సాలర్‌జంగ్ మ్యూజియం, చార్‌మీనార్, జూపార్క్, ట్యాంక్ బండ్‌కు 40 సీట్లతో కూడిన డీలక్స్ బస్సు ఉదయం 6 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 12 గంటల వరకు చేరుకుంటుందని తెలిపారు. దీనికి గాను రూ.1000 చార్జ్ ఉంటుందని తెలిపారు. వర్గల్, కొమ్రవెల్లి, యాదగిరిగుట్ట, రామణేశ్వర్, సువర్ణగిరికు 40 సీట్లతో కూడిన డీలక్స్ బస్సు ఉదయం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 12 గంటల వరకు చేరుకుంటుందని తెలిపారు. దీనికి గాను రూ.1500 చార్జ్ చేయబడుతుందని తెలిపారు. పండరిపూరి, అంబాజోగి, పర్లి-వైద్యనాథ్, హుండా నాగనాథ్, మేహర్‌కు 36 సీట్లతో కూడిన ఎస్‌ఎల్ బస్సు ఉదయం 12 గంటలకు బయలుదేరి మరుసటి ఉదయం 12 గంటల వరకు చేరుకుంటుందని తెలిపారు. దీనికి గాను రూ.3,200 చార్జ్ చేయబడుతుందని తెలిపారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, గుడెంగుట్టకు 40 సీట్లతో కూడిన డీలక్స్ బస్సు ఉదయం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 12 గంటల వరకు చేరుకుంటుందని తెలిపారు. దీనికి గాను రూ.1500 చార్జ్ చేయబడుతుందని తెలిపారు. కొమురవెల్లి, వర్గల్, చిలుకూరి బాలాజీ, దోమగూడెం, అనంతగిరి, కొటాయిపల్లి ట్రాకింగ్‌కు 40 సీట్లతో కూడిన డీలక్స్ బస్సు ఉదయం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 12 గంటల వరకు చేరుకుంటుందని తెలిపారు. దీనికి గాను రూ.1500 చార్జ్ చేయబడుతుందని తెలిపారు.

కుల బహిష్కరణ ఎత్తివేయాలని సీఐకి బాధితుడి మొర

సదాశివనగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): సంబంధం లేని విషయంలో కుల బహిష్కరణ చేయడం అవమానకరంగా ఉందని కుప్రియాల్ గ్రామానికి చెందిన కిష్టయ్య సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్‌కు మొర పెట్టుకున్నట్లు తెలిపారు. నలుగురిపై ఉన్న కేసును సమసి పోయేలా చేయాలని తనపై ఒత్తిడి చేస్తూ కుల బహిష్కరణ చేయడం అవమానకరంగా ఉందని కిష్టయ్య తెలిపాడు. వివరాల్లోకి వెళ్లితే.. మండలంలోని కుప్రియాల్ గ్రామానికి చెందిన బాలరాజు 30 సంవత్సరాల క్రితం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నాగంపేటకు బతుకుదెరువు కోసం వెళ్లి అక్కడే స్థిరపడినట్లు తెలిసింది. ఈ క్రమంలో బాలరాజు బంధువులైనా కుప్రియాల్ గ్రామానికి చెందిన మహిళలను అసభ్య పదజాలంతో దూషిస్తూ లేఖ రాయడంతో కుప్రియాల్ పద్మశాలి కులానికి చెందిన నలుగురిపై బాలరాజు చిన్న కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు 2022లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు విచారణలో ఉండగా వాపస్ తీసుకోవాలని కేసు నుంచి తమను తప్పించాలని నలుగురితో పాటు కామారెడ్డిలో నివాసముంటున్న ఒక వ్యక్తితో పాటు పద్మశాలి సంఘానికి చెందిన కొందరు వ్యక్తులు బాలరాజు చిన్ననాన్న కుప్రియాల్‌లో నివాసముంటున్న కిష్టయ్యపై ఒత్తిడి తీసుకువస్తూ కిష్టయ్యకు మూడు సంవత్సరాల నుంచి కుల బహిష్కరణ చేసినట్లు తెలుస్తోంది. నేను కేసు పెట్టలేదు కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదని కిష్టయ్య కుల సంఘంలో ఎన్నోమార్లు మొరపెట్టుకున్నప్పటికీ అందరూ కలిసి మూడేళ్లుగా కిష్టయ్యకు కుల బహిష్కరణ చేసినట్లు సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. కుల సంఘంలో నెలనెల చిట్టీలు కట్టకపోగా మంచి చెడులకు పిలవడం లేదని దీంతో నేను మానసిక వేదనకు గురవుతున్నానని తనపై చేసిన కుల బహిష్కరణ తొలగిపోయేలా చర్యలు తీసుకోవాలని కిష్టయ్య సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్‌కు మొరపెట్టుకున్నట్లు తెలిపారు.



బస్వన్నపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ ప్రమీల

పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

రాజంపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడి కేంద్రాల్లో పిల్లలకు మెను ప్రకారం పౌష్టికాహరం అందించాలని డీడబ్ల్యూవో ప్రమీలా అన్నారు. మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో అంగన్‌వాడి సెంటర్‌ను గురువారం సందర్శించారు.గర్భిణులకు పౌష్టికాహారం గురించి రక్తహీనత గురించి చెప్పడం జరిగిందని ప్రీస్కూల్ పిల్లలకు చూపడం జరిగిందని తెలిపారు. మెను ప్రకారం వంటలుచేసి పిల్లలకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడి అభివృద్ధి కోసం గ్రామస్థులు ముందుకు వచ్చి ఆట వస్తువులు అంగన్‌వాడికి సంబంధించిన వస్తువులు దాతల రూపంలో అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ రుచిష్మ, అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను చదివించండి

రాజంపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో గురువారం జిల్లా మహిళ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళ సాధికారత కేంద్రం, సఖీ కేంద్రం సభ్యులు అవగాహన కార్యక్రమం చేపట్టారు. పిల్లలు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని ప్రభుత్వ వసతులపై అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మీ తెలిపారు. మహిళ సాధికారత కేంద్రం సిబ్బంది సౌమ్య మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించండి..ఆడపిల్లలను చదివించండి అనే నినాదంతో ప్రతీ ఆడపిల్ల చదువుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సఖీ సెంటర్ సిబ్బంది లావణ్య తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో వానాకాలం పంటలను పరిశీలిస్తున్న దృశ్యం

మద్నూర్‌లో పంటలను పరిశీలించిన అధికారులు

మద్నూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడిఫతేపూర్, మద్నూర్ గ్రామాల్లో వానాకాలంలో సాగు చేస్తున్న పంటలను మండల వ్యవసాయ అధికారి రాజు పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. సోయాబీన్ పంటలో గడ్డి జాతి కలుపు నివారణకు క్విజాలాఫాఫ్ ఈథైల్ 40 ఎంఎల్ లేదా ప్రాపాక్వైజాఫాప్ 250 ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని, అలాగే వెడల్పాకు ఆకు ఉన్నట్లయితే ఇమజిత్పైర్ 400 ఎంఎల్ మందును పిచికారీ చేయాలని తెలిపారు. గడ్డి జాతి మరియు వెడల్పాకు ఉన్నట్లయితే క్విజాలోఫాప్ పి ఈథైల్ ప్లస్ ఇమాజిత్పైర్ 200 ఎంఎల్ లేదా ఇమాజిత్పైయిర్ ప్లస్ ప్రాపాక్వై జాపాప్ 800 ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో ముందులు వాడేటప్పుడు జాగ్రత్తగా గాలి, వర్షం లేనప్పుడు భూమిలో తేమ ఉన్నప్పుడు ఉదయం సమయంలో కలుపు నివారణ చేస్తే మంచి ఫలితం ఉంటుందని సూచించారు. మండల వ్యవసాయ అధికారితో పాటు ఏఈవో సౌమ్య, సరోజ, రైతులు పాల్గొన్నారు.

దేగావత్ సుశీలకు డాక్టరేట్ ప్రదానం

కామారెడ్డి టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెద్దకొడప్‌గల్ మండ లం అంజని తండా గ్రామానికి చెందిన దేగావత్ సుశీలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికారులు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఓయూ తెలుగు శాఖ ఆచార్యులు సూర్యధనంజయ పర్యవేక్షణలో సుంకిరెడ్డి నారాయణరెడ్డి జీవిత సాహిత్యం అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేటు ప్రదానం చేశారని ఆమె తెలిపారు.



నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న కొత్త నీరు

ప్రాజెక్టులో పెరుగుతున్న నీటి సామర్థ్యం

నిజాంసాగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిజాంసాగర్ ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు గురువారం వస్తూనే ఉంది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టులో క్రమేపీ నీటి నిల్వలు పెరగాల్సి ఉండగా ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలోనికి నీటిని విడుదల చేస్తూ ఉండటంతో నీటి సామర్థ్యం పెరగటం లేదు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1405.00 అడుగులకు గాను 1391.88 అడుగులని సామర్థ్యం కలిగి ఉంది. ప్రాజెక్టులో 17.802 టీఎంసీలకు గాను 4.916 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు అవుతున్నా భారీ వర్షాలు కురియకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న దృశ్యం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

ఎల్లారెడ్డి రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని వెల్లుట్ల, వెల్లుట్లపేట గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో ప్రకాష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైనా ఇళ్లు లేని అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మొదటి విడతలో ఎంపికైన లబ్ధిదారుల్లో వెల్లుట్ల గ్రామంలో 12, వెల్లుట్లపేటలో 9 ఇందిరమ్మ ఇండ్లు బేస్మెంట్ లెవెల్‌లో నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే నిర్మాణాలు చేపట్టి సకాలంలో బిల్లులను పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్, హౌసింగ్ ఏఈ సందీప్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజాగౌడ్, అంజయ్య, సాయిలు, రాజు, చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నల్ల బ్యాడ్జీలతో మార్కెట్ కమిటీ ఉద్యోగల నిరసన

కామారెడ్డి టౌన్, జూలై 3: కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట గురువారం మార్కెట్ కమిటీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్‌పై ఏఎంసీ వైస్ చైర్మన్ చేసిన దాడి చేయడం సిగ్గు చేటు మండిపడ్డారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



భీమ్‌గల్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై

భీమ్‌గల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై సందీప్ తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందస్తుగా రౌడీషీట్ ఉన్న వ్యక్తులకు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో చట్టాన్ని చేతిలోకి తీసుకొని శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే అదుపులోకి తీసుకొని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. అలాగే ఏదైనా సమస్య వచ్చినప్పుడు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.

మోర్తాడ్‌లో ఉపాధ్యాయుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో సమ్మిరెడ్డి

మోర్తాడ్ జూలై3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో టీచర్ల సర్దుబాటు కోసం సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి సమ్మిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మోర్తాడ్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు ప్రభాకర్, దొన్కల్ ప్రధానోపాధ్యాయులు డీజే జగదీశ్వర్‌లు కమిటీ సర్దుబాటు చేసింది. ఎలాలవాడు ఎంపీపీఎస్ నుంచి సుమలతను ఎంపీపీఎస్ సుంకెట్‌కు, ధర్మోర ఎంపీపీఎస్ నుంచి సతీష్‌ను రామ్‌నగర్ దోపాల్‌కు, తిమ్మాపూర్ నుంచి ఎల్. లిఖితను మధునగర్ తిమ్మాపూర్‌కు, దొన్కల్ నుంచి కిరణ్‌కుమార్‌ను శెట్ పల్లికి, గాండ్లపేట్ నుంచి జ్యోతిని బాలిక పాఠశాల మోర్తాడ్‌కు సర్దుబాటు చేశామని ఎంఈవో తెలిపారు. సమావేశంలో ఉపా ధ్యాయసంఘాల నాయకులు ప్రవీణ్, బాలరాజు, రవీందర్, రమేష్, మధుసుధన్‌రావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమ్మేళన సభకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

జక్రాన్‌పల్లి, జూలై3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో శుక్రవారం జరుగనున్న కాంగ్రెస్ సమ్మేళన సభకు జక్రాన్‌పల్లి మండలం అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి కోరారు. గురువారం జక్రాన్‌పల్లిలో ఆయన మాట్లాడుతూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తీసుకున్న జైబాపు, జైభీమ్ కార్యక్రమంలో భాగంగా ఎల్‌బీ స్టేడియంలో టీపీసీసీ ఆధ్వర్యంలో జరుగనున్న కాంగ్రెస్ గ్రామకమిటీల అధ్యక్షుల సమ్మేళనం జరుగుతుందని తెలిపారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. సభకు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో రైతులకు అధిక లాభాలు



ఖానాపూర్‌లో ప్లాంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్న అధికారి

ఆర్మూర్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ ఫాం పంటను సాగుచేసే రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని ఉద్యానవనశాఖాధికారి రాజుగౌడ్ అన్నారు. గురువారం ఆర్మూర్ మండలం ఖానాపూర్ గ్రామంలో ప్రీ యూనిక్ ఆయిల్ ఫాం సంస్థ ఆధ్వర్యంలో ప్లాంటేషన్ ప్రోగాం నిర్వహించారు. ఈ సందర్భంగా మోత్కూరిలింగాగౌడ్ ఆయిల్ ఫాం పంట సాగుకు ఆరుఎకరాలకు డీడీలు చెల్లించారు. అనంతరం రైతులకు ఆయిల్‌పాం పంట సాగుపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



సహాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయుడు

వేల్పూర్, జూలై3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో 2015వ సంవత్సరంలో తమతో పదో తరగతి చదువుకున్న తోటి విద్యార్థి ఆకాష్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గత నెల 20న మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మృతుని తోటి విద్యార్థులు గురువారం పడిగెలలో వారి ఇంటికి చేరుకొని ఆ కుటుంబానికి ప్రగాడ సానుభూతిని, సంతాపం తెలియజేశారు. ఆనాటి క్లాస్‌మెంట్ అందరితో పాటు ఆనాటి ఉపాధ్యాయుడు సంగెం అశోక్ ఆధ్వర్యంలో రూ. 50వేలు ఆర్థిక సహాయం మృతిని కుటుంబానికి నగదు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఆనాటి పూర్వ విద్యార్థులు అరవింద్, అరుణ్, భరత్, అమీర్, శివ, ఆనంద్, అనూష, శ్వేత, తదితరులున్నారు.

లబ్ధిదారుల ఖాతాలో రూ.లక్ష జమ

భీమ్‌గల్, జూలై3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ లబ్ధిదారుల ఖాతాలో ప్రభుత్వం రూ.లక్ష జమచేసిందని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. ఇళ్లులేని నిరుపేదల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకంలో భాగంగా చేపట్టిన ఇంటి నిర్మాణాలు బేస్మిట్ వరకు పూర్తి అయిన లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమయ్యాయి. నిర్మాణ పనులు చేపట్టని వారు వెంటనే పనులు చేపట్టాలని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతిని సాధించాలి

కమ్మర్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మఇండ్ల నిర్మాణ పనుల్లో తగిన పురోగతిని సాధించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. గురువారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంతో పాటు మండలంలో పైలెట్ గ్రామంగా ఎన్నికైన నాగాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై సంబంధిత అధికారులు, లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాలకు మంజూరైన ఇండ్లు ప్రస్తుత నిర్మాణదశ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్



రైతులకు చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

బోధన్‌రూరల్,జూలై3(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రైతులసంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల కృషిచేస్తుందని బోధన్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ చీల శంకర్ అన్నారు. గురువారం సాలూర మండలంలోని హున్స గ్రామంలో రైతులకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు హార్టికల్చర్ ఆధ్వర్యంలో తీగపందిళ్ల చెక్కులను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందన్నారు. ఎన్నికలలో ఇచ్చినహామీ ప్రకారం రైతు భరోసా ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. రైతులు అన్ని పంటలను సాగుచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలోనే భాగంగా తీగపందిళ్ల చెక్కులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ వసంత్ రెడ్డి, బోధన్ హార్టికల్చర్ అధికారి వాహిద్, ఏవో శ్వేత, ఏఈవో శ్రావణి, సొసైటీ డైరెక్టర్లు బాలకృష్ణారెడ్డి, పద్మారెడ్డి, ఖాజాపూర్ అశోక్, సొక్కం రవి, శంకర్, హున్స గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కూతుళ్లను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయుడు

ముప్కాల్ , జూలై3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రాంగిరి బాలగంగాధర్ తన ఇద్దరి కూతుళ్లను అదే పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ప్రైవేట్ పాఠశాలలో చదువుకున్న అఖిల 7వ తరగతి, వర్షిణి 9వ తరగతి తమ పిల్లలను గురువారం పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాల ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంద న్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగారాం ఉపాధ్యాయున్ని బాల గంగాధర్‌ను అభినందించారు.

సోలార్ ప్లాంట్‌కు స్థల పరిశీలన

ఎడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జానకంపేట గ్రామ శివారులోగల శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పరిసరాల్లోని ఆలయ భూమిలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సోలార్‌ప్లాంట్‌కు కేటాయించిన స్థలాన్ని గురువారం డీఆర్‌డీవో, దేవాదాయ శాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులతో 2 మెగావాట్ల విద్యుత్‌ఉత్పత్తి సోలార్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుందని, దీని నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించామన్నారు. సోలార్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలించిన వారిలో డీఆర్‌డీఏ మధుసూదన్, డీపీఎం మోహన్, ఆలయ ఈవో వేణు, రెడ్కో సంస్థ ప్రతినిధులు, ఐకేపీ ఏపీఎం గంగారాం, సీసీ వినోద్, రఘు, జాన్కంపేట మహిళా సంఘం సభ్యులున్నారు.

సజ్జ పంట డబ్బులు ఇప్పించాలని వినతి

ముప్కాల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంజర్ల గ్రామంలో యాసంగిలో వేసిన సజ్జపంటకు అగ్రిమెంట్ ప్రకారం క్వింటాలుకు రూ. 6,500 డబ్బులు సజ్జల యజమాని ద్వారా ఇప్పించామని వ్యవసా యాధికారికి వినతిపత్రం అందజేశారు. యాసంగిలో గడ్డం రాజేశ్వర్ క్వింటాలుకు రూ.6,500 చొప్పున సజ్జలు కొంటానని 30 మంది రైతులకు సజ్జ విత్తనాలు ఇచ్చి ప్రస్తుతం డబ్బులు చెల్లించడం లేదని, దీని ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఒప్పందం ప్రకారం రైతులకు న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమలో సీహెచ్ రవి, జంగం మురళి, సుంకరి గబ్రేల్, జంగం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

ముప్కాల్ , జూలై3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను జీఈసీవో భాగ్యలక్ష్మి పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, విద్యాబోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న యూనిఫాంలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ వినోద, ఏపీఎం ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

'నిరుపేదలు, విద్యార్థులకు అండగా ఉంటాం'

వర్ని, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలు, పేదవిద్యార్థులకు అండగా ఉంటామని సీసీ డీ మేనేజర్ ఠాగూర్ హామీ ఇచ్చారు. గురువారం వర్నిలో నిరుపేదలకు నిత్యావసర సరు కులు, పాఠశాల విద్యార్థులకు బ్యాగులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు అతిమెల నగేష్, పీవీ సుబ్బారావు, నర్సయ్య, నగేష్, భాస్కర్, శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామ సంఘాల పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక శిక్షణ

నాగిరెడ్డిపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన గ్రామసంఘాల పాలక వర్గ సభ్యులకు గురువారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో 32 గ్రామ సంఘాలుండగా, మొదటగా గురువారం మండలంలోని 16 గ్రామసంఘాల పాలకవర్గ సభ్యులైన అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారులకు కరీంనగర్ జిల్లాకు చెందిన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు సంగీత, పుష్పలతలు శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శాంత, కోశాధికారి మణెమ్మ, ఏపీఎం జగదీష్ కుమార్, అకౌంటెంట్ రాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేవునిపల్లిలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదు : ఎంఈవో

ఎల్లారెడ్డి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దేవునిపల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేవని ఎల్లారెడ్డి ఎంఈవో రాజులు అన్నారు. గురువారం ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పాఠశాల భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ఎన్ని మంది విద్యార్థులు ఉన్నారని, పాఠశాలకు రెండు తరగతి గదిలో ఉండగా ఒక భవనం శిథిలావస్థలో ఉండడంతో మరో భవనంలో విద్యార్థులుంటున్నారని ఇబ్బందులు లేవని అన్నారు.

'బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టండి'

జక్రాన్‌పల్లి, జూలై3 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లిలోని 44వ జాతీయ రహదారి నుంచి ఆదర్శపాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు వెళ్లే బీటీ రోడ్డు చెడిపోయి అధ్వానంగా మారిందని, పనులను తక్షణమే చేపట్టాలని మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లిప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జక్రాన్‌పల్లిలో ఈ పాఠశాలలకు వెళ్లే చెడి పోయిన బీటీరోడ్డును కన్నెపల్లి ప్రసాద్, బీజేపీ నాయకులు కలిసి పరిశీ లించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీటీరోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలన్నారు.

అత్తను నరికి చంపిన అల్లుడు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

పిట్లం జులై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గురువారం అత్తను కమ్మకత్తితో గొంతు కోసి హత్యచేశాడు అల్లుడు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జిన్నలక్ష్మి (50) అదే గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో వంటమనిషిగా విధులు నిర్వహిస్తుంది. బ్రాహ్మణపల్లి గ్రామంలో మిట్ట మధ్యాహ్నం ఊరులోనే జిన్న లక్ష్మీ అనే మహిళను అలుడు జిన్న బాగ రాజు కమ్మకత్తితో చంపాడు. విషయం తెలిసిన పోలీ సులు ఎస్సై రాజు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించారు. బాన్సువాడ డీఎస్పీ విఠ ల్‌రెడ్డి, సీఐ రాజేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తీసుకున్న అప్పు చెల్లించమని అత్త అల్లుడిని అడుగగా గొడవపడి కోపంతో కమ్మకత్తితో ఆమె గొంతు కోసి నరికి చంపాడని పోలీసులు తెలిపారు. మృతురాలి కొడుకు అయిన జిన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మృతురాలికి కొడుకు, కుతురున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వాటర్ క్లోరినేషన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారి

ఎల్లారెడ్డి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్‌లు వాటర్‌మెన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల దృష్ట్యా ఎప్పటికప్పుడు లీకేజీలకు మరమ్మతులు చేయాలని, అదేవిధంగా వాటర్ ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వినోద్ కుమార్, వార్డు అధికారులు, పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, వార్డు అధ్యక్షుడు బెస్త రమేష్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, సాయిరాం, ప్రశాంత్, భూమయ్య పాల్గొన్నారు.

'ధృవపత్రాల కోసం మీ సేవాలో దరఖాస్తులు ఇవ్వాలి'

ఎడపల్లి, జులై03(ఆంధ్రజ్యోతి) : వివిధ రకాల ధృవపత్రాలు అవసరం ఉన్నవారు తమ దరఖాస్తు ఫారాలను రిజిస్ట్రేషన్ చేసుకున్న మీసేవా కేంద్రంలోనే అందించాల, నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి తీసుకురావద్దని ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి అన్నారు. గురువారం మండల మీసేవా కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీసేవా కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి మీ సేవా నిర్వాహకులు నేరుగా తీసుకురావాలన్నారు.

కేజీబీవీ పాఠశాలకు కాంస్య పతకం

ముప్కాల్ , జూలై3 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థి శ్రీలత 600 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వినోద తెలిపారు. బుధవారం నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన అండర్ -10, 12, 14 విభాగంలో 26 మంది విద్యార్థులు ముప్కాల్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులు పోటీలలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులను పాఠశాలలో అభినందించారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

భీమ్‌గల్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనుగొప్పుల గ్రామంలో గురువారం ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతిఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని, నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత వస్త్రువు లు, మధ్యాహ్నభోజనం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోజాగౌడ్, బాల్కొండ నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సేపూర్ చరణ్‌గౌడ్, గ్రామకమిటీ అధ్యక్షుడు వంజరీ శంకర్, విద్యాకమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సంధ్య, భూమేశ్వర్, రాగి నరసింహచారి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : పొతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఏకరూప దుస్తులను ఎంఈవో శంకర్ పంపిణీ చేశారు. పాఠశాలలో 349 మంది విద్యార్థులకు ఒక జత ఏకరూప దుస్తులను అందజేశామన్నారు. మరో జత త్వరలోనే అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు నాగనాథ్, రామారావు, సుజాత, షబానా పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నవీపేట,జూలై3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని నవతెలంగాణ విద్యార్థి సంఘం కార్యదర్శి పల్లపు తులసిరాం కోరారు. గురువారం మండల విద్యాశాఖ అధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్‌లను విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మార్చారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్, నవీన్ తదితరులున్నారు.

రేషన్‌కార్డుల దరఖాస్తులను వెంటనే పరిశీలించాలి

నవీపేట, జూలై3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోగా ఇందులో చాలా దరఖాస్తులు ఆన్‌లైన్ పూర్తికాలేదని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సంజీవ్ అన్నారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నందిగామ మాజీ సర్పంచ్ సాయన్న, భూంరావు, శ్రీనివాస్ తదితరులున్నారు.

రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంచాలి

నసురుల్లాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి భవాని అన్నారు. గురువారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని సొసైటీ పరిధిలో యూరియా స్టాక్ ఉందా లేదా అని సొసైటీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నాట్లు వేశాక రైతులకు యూరియా తప్పకుండా అందుబాటులో ఉంచాలని అన్నారు. ఆమె వెంట సొసైటీ సిబ్బంది రైతులు తదితరులు ఉన్నారు.

ఆలూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆలూర్, జూలై3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పన్నెండుమందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం బీజేపీ నాయకుడు డాక్టర్ అరుణ్ అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆలూర్ గ్రామంలో ప్రజలు ఎవరైనా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్సనిమిత్తం ఖర్చులను సీఎంఆర్ ద్వారా ఇప్పిస్తానని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు హరీష్, మల్లయ్య, సురేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించాడని ఫిర్యాదు

భీమ్‌గల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన జిల్లా కేంద్రానికి చెందిన బండారి రఘురాం యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భీమ్‌గల్ ఎస్సై సందీప్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి చెందిన రఘురాం యాదవ్ సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన దళిత యువతిని 2021లో ప్రేమించి వివాహం చేసుకున్నాడన్నారు. ఇప్పుడు తప్పించుకు తిరుగుతున్నాడని, చట్టప్రకారం శిక్షించాలని ఫిర్యాదులో దళిత సంఘం సభ్యులు కోరారు.

ఇసుక లారీ పట్టివేత

ఎడపల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారి గుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. బుదవారం రాత్రి 3 గంటల ప్రాంతంలో బోధన్ నుంచి నిజామాబాద్ వైపు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా సీజ్ చేసి, ఓనర్ అజీజ్, డ్రైవర్ సిరాజ్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

బోధన్‌రూరల్, జూలై3(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమ, నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించి ప్రమాదాల నివారణకు తోడ్పడాలని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్‌అలీ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని మాస్టర్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్‌లతో కళాశాల విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు.

మోస్రా తహసీల్దార్‌గా రాజశేఖర్

మోస్రా,జూలై3(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ మారుతి బదిలీపై వెళ్లగా ఆర్‌డీవో కార్యాలయం బోధన్‌లో డిప్యూటీగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ మోస్రా తహసీల్దార్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రుద్రూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని కాపాడి చెరువుకి రక్షణ కల్పించాలని గురువారం చిక్కడ్‌పల్లి గ్రామస్థులు రుద్రూరు తహసీల్దార్ తారాబాయికి వినతిపత్రాన్ని అందజేశారు. చిక్కడ్‌పల్లి శివారులోని సర్వేనెంబర్ 202/ఇలోని 0.20గుంటల భూమిని ఓ వ్యక్తి కబ్జాచేసి పట్టా చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని, ఆ ప్రయత్నాలను రద్దు చేయాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కుర్మరాజు, కర్రోళ్ల రాజయ్య, నక్క గంగాధర్, జెల్ల పరమేష్, కుర్మ మల్లయ్య పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా కేసులో ముగ్గురికి జైలు

కోటగిరి,జూలై3(ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణా కేసులో ముగ్గురికి ఒకరోజు జైలుశిక్షతో పాటు మూడువేల రూపాయల జరిమాన విధించినట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. పొతంగల్ మండలంలోని కొల్లూర్‌లో ఏప్రిల్ 16వ తేదీన షేక్‌అతిక్, షేక్ సోహెల్, షేక్‌అవేజ్ అనే ముగ్గురువ్యక్తులు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి నాలుగు ఎద్దులను వాహనంలో అక్రమ రవాణా చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చగా బోధన్ న్యాయాధికారి శేషతల్ప సాయి నిందితులకు ఒకరోజు జైలుశిక్షతో పాటు 3వేల రూపాయల జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

రెంజల్,జూలై3(ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన శివరాత్రి పెద్దసాయిలు మద్యం సేవించి వాహనం నడపడంతో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసు నమోదు చేశామని, గురువారం బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

'ప్రజలు సుఖశాంతులతో ఉండాలి'

బోధన్‌రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భగవంతుడు శ్రీకృష్ణుడి ఆశీర్వాదంతో ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకటనారాయణ, ఇస్కార్ ప్రతినిధులు సీతారాయ్‌దాస్, రత్నమాయి రాధికదేవిదాస్, కేశవ కరుణానిధి దాస్, అశోక్ ఆత్మదాస్ ఉన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన సదస్సు

మాక్లూర్, జూలై3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయ్ కళాశాల ఆఫ్ ఫార్మసీలో గురువారం ఎయిడ్స్ నివారణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పింగళి నర్సింహారావు హాజరై మాట్లాడుతూ హెచ్ఐవీ బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశంపై వివరించారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి సుధాకర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతీఒక్కరికి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

జ్యోతిబాపూలేకు నివాళి

వేల్పూర్, జూలై3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట్ గ్రామంలో జ్యోతిబాపూలేకు అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నివాళులు అర్పించారు. జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి జాంబవచామర్, ఉపాధ్యక్షుడు సుమన్, రణవీర్, బీసీ సంఘం నాయకులు కిషన్, కిషన్ తదితరులున్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్ రూరల్, జూలై3 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలో గురువారం మాల మహనాడు, యశోబుద్ధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుద్ధునితో నా ప్రయాణం నాటిక ప్రదర్శన పోస్టర్లను ఆవిష్క రించారు. ఈనెల 5వ తేదీన పెర్కిట్‌లోని ఎంఆర్ గార్డెన్‌లో సాయంత్రం 6.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు మాలమహానాడు ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు మాదరి రాజన్న, ప్రధాన కార్యదర్శి మూగ ప్రభాకర్, పింజ పెద్దబోజన్న తెలిపారు. కార్యక్రమంలో తాళ్ల రాజయ్య, కృషాల్, అగ్గు క్రాంతి, అంగిరి ప్రదీప్, తెడ్డు నర్సయ్య పాల్గొన్నారు.

సామర్థ్యాల ఆధారంగా బోధించాలి

మాచారెడ్డి, జూలై 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా బోధిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని మాచారెడ్డి మండల విద్యాధికారి దేవేందర్ అన్నారు. గురువారం మండలంలోని లచ్చాపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈవో సందర్శించి తరగతి గదులను, రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థులచే సంయుక్త పదాలను రెండక్షరాల ద్విత్వాక్షర పదాలను రాయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు శ్రీకాంత్, బ్రహ్మం, సీఆర్పీ నరేష్ పాల్గొన్నారు.

7న ప్రతీ గ్రామంలో ఆత్మగౌరవ జెండా ఎగరాలి

మాచారెడ్డి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఏర్పడి 31 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రతీ గ్రామంలో ఈ నెల 7 ఎమ్మార్పీఎస్ ఆత్మగౌరవ జెండా ఎగురవేయాలని ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి షామెల్ అన్నారు. గురువారం మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో మండల అధ్యక్షుడు బట్టి రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలాలు సమాజానికి వివరించి అన్ని వర్గాలను కూడగట్టాలన్నారు. సాయంత్రం సభలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్తిగారి లక్ష్మీ, జిల్లా నాయకులు యాదగిరి, లావణ్య, నర్సింలు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య టెక్నో పాఠశాలకు నోటీసు అందజేత

బాన్సువాడ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రారంభించిన శ్రీ చైతన్య టెక్నో పాఠశాలకు గురువారం ఎంఈవో నాగేశ్వరరావు వివరణ కోరుతూ నోటీసులు అందజేశారు. పాఠశాలలో నోటీసులు తీసుకునేందుకు ఎవరూ లేకపోవడంతో ఎంఈవో కార్యాలయ సిబ్బంది సదరు పాఠశాల కార్యాలయానికి నోటీసును అతికించారు. పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేకపోయినా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ అడ్మిషన్లు తీసుకోవడంపై ఎంఈవో వివరణ కోరారు.



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కాసుల బాల్‌రాజ్

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన

బాన్సువాడ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన రహదారిపై కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, మాజీ చైర్మెన్ జంగం గంగాధర్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖాలేక్, నార్ల రవీందర్, వహబ్ తదితరులున్నారు.



బాన్సువాడ ప్రభుత్వాస్పత్రిలోని పిల్లల వార్డును పరిశీలిస్తున్న దృశ్యం

పిల్లల వార్డును పరిశీలించిన డీఎంహెచ్‌వో

బాన్సువాడ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గల పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్న పిల్లల వార్డును గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. పిల్లలను ఏవిధంగా చూసుకోవాలో సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, ఆర్‌ఎంవో సుజాత, సీహెచ్‌వో దయానంద్, హెల్త్ సూపర్‌వైజర్ గౌస్, సిబ్బంది తదితరలున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

జుక్కల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో విద్యార్థులు క్రమశిక్షణగా ఉండి ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ అన్నారు. గురువారం జుక్కల్ ప్రభుత్వ పాఠశాలలో ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడకుండా మత్తు పదార్థాలు జోలికి వెళ్లకుండా భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తిరుపతయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే పిల్లల్లో ఎదుగుదల

పెద్ద కొడప్‌గల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉండే పిల్లలకు సరియైన పోషకాహారం అందిస్తేనే వారిలో ఎదుగుదల ఉంటుందని వడ్లం అంగన్‌వాడీ కార్యకర్త స్వరూప అన్నారు. గురువారం వడ్లం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులకు పోషకాహారం వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారం చిన్నారులకు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం కేంద్రంలో గల చిన్నారుల బరువు, ఎత్తును కొలతలు వేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట్, ఉప్పల్వాయి, అన్నారం, పోసానిపేట్ తదితర గ్రామాల్లో ఆలయ గర్భగుడిలో పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్ద కొడప్‌గల్ ఎస్సై బదిలీ

పెద్ద కొడప్‌గల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పెద్దకొడప్‌గల్ ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న మహేందర్ కామారెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు. పెద్ద కొడప్‌గల్ నూతన ఎస్సైగా వీఆర్‌లో ఉన్న అరుణ్ కుమార్‌ను నియమించారు.



అమెరికాలో భారతదేశ జెండాను చూపుతున్న మహమ్మద్ బాబా

జిల్లా కానిస్టేబుల్‌కు అంతర్జాతీయ మెడల్

కామారెడ్డి టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాకు చెందిన కానిస్టేబుల్ మహమ్మద్ బాబా అమెరికాలోని బర్మింగ్‌హోమ్ నగరంలో నిర్వహిస్తున్న వరల్డ్ పోలీసు అండ్ ఫైర్ గేమ్స్‌లో పాల్గొన్నట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. షాట్‌పుట్ విభాగంలో మన రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహించిన మహమ్మద్‌బాబా బ్రాంజ్ మెడల్ సాధించి దేశానికి, రాష్ట్రానికి, మన జిల్లాకు గర్వకారణంగా నిలిచారని తెలిపారు.

మెకానిక్‌లకు ప్రభుత్వం చేయూతనివ్వాలి



బిచ్కుందలో జెండా ఎగురవేస్తున్న బైక్ మెకానిక్‌లు

బిచ్కుంద, జూలై 3(ఆంధ్రజ్యోతి): బైక్ మెకానిక్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారికి ప్రభుత్వపరంగా చేయూత నివ్వాలని అధ్యక్షుడు అబ్బాస్ అన్నారు. గురువారం మెకానిక్‌లు ఐక్యతతో కూడిన జెండాను ఎగురవేశారు. బైక్ మెకానిక్‌లు చాలా వరకు 10వ తరగతి చదివి మానేసిన వారే ఉన్నారని ఆర్థిక పరంగా అభివృద్ధి చెందేందుకు కార్పొరేషన్ లోన్లు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు భాను, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండల కేంద్రంలో గురువారం ప్రపంచ ద్విచక్ర వాహన మెకానిక్‌ల దినోత్సవాన్ని మెకానిక్‌లు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు కేక్‌లు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల బైక్ మెకానిక్‌ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళీ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాన్ని గాటిబ్ డైమ్లర్ తయారు చేసిన వ్యక్తిగా అతనిని మోటార్ సైకిల్ పితామహుడిగా పిలుస్తారని అతని జన్మదినాన్ని ప్రపంచ మోటార్ సైకిల్ మెకానిక్‌ల దినోత్సవంగా జరుపుకుంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు యూసూఫ్, ప్రధాన కార్యదర్శి బాష, కోషాధికారి రామకృష్ణ, మెకానిక్‌లు నరేష్, లక్ష్మణ్, సురేష్, అనిల్ దేవీసింగ్, శివ, హరీష్, అమర్‌దాస్, అనిల్, బాష, అరవింద్, జమిల్‌లతో పాటు మెకానిక్‌లు ఉన్నారు.

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ శివారులోని ఆటో నగర్‌లో టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మెకానిక్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానిక్ దినోత్సవ జెండాను అసోసియేషన్ సభ్యులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మెకానిక్‌లకు ప్రత్యేక పథకాలు అందించాలని, సంక్షేమం కోసం పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కిరణ్, శ్రీనివాస్, శ్యామ్‌రావు, ధన్‌రాజ్, విష్ణు, విజయ్, సంజీవ్, రాజేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



లింగంపేటలో కేక్ కట్ చేస్తున్న మెకానిక్‌లు



కామారెడ్డిలో అసోసియేషన్ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి



బీర్కూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బీర్కూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశం ఉంది. ఈ సమావేశానికి బీర్కూర్ మండలం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించనున్న కార్యకర్తల సన్నాహక సమావేశానికి జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. అలాగే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పర్యవేక్షకురాలు మీనాక్షి నటరాజన్, మంత్రులు కూడా సమావేశానికి హాజరవుతున్నారని అన్నారు. ఈ సమావేశానికి బీర్కూర్ మండలంలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సన్నాహక సమావేశం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీనియర్ నాయకులు శంకర్, బస్వరాజ్, రాములు, వెంకట్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

బీర్కూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి తమ ఇష్టారీతిన వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, తెలంగాణ స్టూడెంట్ పరిషత్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం విద్యార్థి సంఘాల నాయకులు మండల విద్యాధికారి వెంకన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ(ఎస్), టీఎస్‌పీ జిల్లా అధ్యక్షులు బాల్‌రాజ్, శ్రీకాంత్‌లు మాట్లాడుతూ బీర్కూర్ మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగిస్తున్నాయని ఆరోపించారు. ఒక చోట అనుమతులు పొంది మరోచోట పాఠశాలలను నడుపుతున్నారన్నారు. ఒక విద్యాసంస్థ అయితే పూర్తిగా రేకుల షెడ్డులో కొనసాగుతుందన్నారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఇందులో చదువుకుంటున్న 400 మంది విద్యార్థులకు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకోవడానికి ఆటస్థలాలు లేవనీ, మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేవన్నారు. తాగడానికి మినరల్ వాటర్ సదుపాయం కూడా కల్పించడం లేదన్నారు. అయినా వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ, అనర్హత కలిగిన టీచర్లతో విద్య బోధన కొనసాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారని విమర్శించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున్న ఉద్యమలు చేపడతామని హెచ్చరించారు.



బీర్కూర్‌లో ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జిల్లాలో ఎస్సైల బదిలీలు

కామారెడ్డి టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని ఆయా మండలాల పోలీసుస్టేషన్‌లలో, వీఆర్‌లో ఉన్న ఎస్సైలను ఎస్పీ రాజేష్ చంద్ర గురువారం బదిలీ చేశారు. కామారెడ్డి వీఆర్‌లో ఉన్న నవీన్ చంద్రను జుక్కల్ పోలీసుస్టేషన్‌కు, వీఆర్‌లో ఉన్న రాఘవేంద్రను నస్రూల్లాబాద్ పోలీసుస్టేషన్‌కు, వీఆర్‌లో ఉన్న అరుణ్‌కుమార్‌కు పెద్దకొడప్‌గల్ పోలీసుస్టేషన్‌కు, నస్రుల్లాబాద్ పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న లావణ్యను రామారెడ్డి పోలీసుస్టేషన్‌కు, వీఆర్‌లో ఉండి ప్రస్తుతం రామారెడ్డి పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న రాజారాంను కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. సదాశివనగర్‌లో పని చేస్తున్న రంజిత్‌ను దేవునిపల్లి పోలీసుస్టేషన్‌కు, రాజంపేటలో పని చేస్తున్న పుష్పరాజ్‌ను సదాశివ నగర్‌కు, దేవునిపల్లి ఎస్సైగా పని చేస్తున్న రాజును, పెద్దకొడప్‌గల్‌లో పని చేస్తున్న ఎస్సై మహేందర్‌లను వీఆర్‌లోకి బదిలీ చేశారు.

మోడల్ స్కూల్ వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించాలి

రామారెడ్డి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులకు సదాశివనగర్ మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్ వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించాలని గురువారం కోరుతూ కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఆర్టీసీ సిఐ లింగమూర్తికి నాయకులు, గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గతంలో టీఎంను కలిసి వినతిపత్రం ఇవ్వగా మీతో సర్వే చేయించి బస్సును పంపుతామని చెప్పారని అయినప్పటికీ సర్వే చేయకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే సర్వే చేసి బస్సులు వేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రెడ్డి మల్లేష్ అక్కడి నుంచి సదాశివనగర్ మాజీ జెడ్పిటిసికి పడిగెల రాజేశ్వర్ రావు ఫోన్‌లో సిఐతో మాట్లాడారు. త్వరలోనే సర్వే చేసి బస్సులు వేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి మల్లేష్, జె. రాజేశ్వర్, జె. సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు బెంచీల అందజేత

కామారెడ్డి టౌన్, జూలై 3: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం సికింద్రాబాద్ రోటరి క్లబ్ సభ్యులు 20 బెంచీలను అందజేసినట్లు మాజీ కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయి కి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనిల్, గ్రామస్థులు పెద్ద సాయిలు, గంగాధర్ రావు, రాజు, హన్మండ్లు, అశోక్, రామాంజనేయులు, పాఠశాల కమిటీ చైర్మన్ సంధ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో డెస్కుల అందజేత

రాజంపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమడ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం ఒక లక్ష 50 వేల విలువైన 35 డ్యూయల్ డెస్కులను రోటరి క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సంస్థ సభ్యులు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు డెస్కులు అవసరమని తెలుసుకుని వెంటనే సామాజిక దృక్పథంలో అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల రికవరీలో శెట్పల్లి సంగారెడ్డి ఆరవ స్థానం

లింగంపేట, జులై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి సహకార సంఘం ఎల్‌టీ రుణాల రికవరీలో ఆరవ స్థానంలో నిలవడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కోపరేటివ్ బ్యాంక్ అధికారులు సీఈవో శ్రీనివాస్‌ను మెమోంటో, శాలువాలతో సన్మానించారు. గురువారం నిజామాబాద్‌లో జరిగిన సమావేశంలో జిల్లాలోని టాప్ టెన్ సొసైటీలను గుర్తించి వారికి సన్మాణించారు. ఈ సందర్భంగా జిల్లా కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేండింగ్‌లో ఉన్న రుణాలను రికవరి చేయడంలో శెట్పల్లిసంగారెడ్డి సొసైటీ అదర్షంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ సీఈవో నాగభూషణం, జీఎం అన్నపూర్ణతో పాటు అధికారులు ఉన్నారు.

పోలీసు శాఖలో ప్రక్షాళన

(5వ పేజీ తరువాయి)

నిర్లక్ష్యం వహిస్తున్న సీఐ దృష్టి సారించడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఎస్సైపై వేటు పడడంతో ఆరోపణలు వస్తున్న సీఐలపై సైతం వేటు వేసేలా ఎస్పీ దృష్టి సారించాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

పోలీసుశాఖలో కొత్త సంస్కరణలు

పోలీసుశాఖలోని అధికారులు పనితీరును ఎస్పీ పర్యవేక్షించడమే కాకుండా నిర్లక్ష్యంగా ఉన్నవారిపై వేటు వేస్తున్న విషయం తెలిసిందే. అయితే బాధ్యతగా పనిచేసే అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఎప్పటికప్పుడు ప్రశంసిస్తూ వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. జిల్లాలో నేరాలు నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకుని ముందుకు పోతున్నారు. గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. దీనికి ప్రధాన కారణం ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను ఎస్సైలు కానీ సీఐలు గాని దత్తత తీసుకుని మూడు నెలల పాటు పర్యవేక్షించాలని ఎస్పీ ఆదేశించారు. ఇలా చేయడంతోనే ప్రమాదాలు తగ్గాయని పోలీసువర్గాలు చెబుతున్నాయి. అదేవిధంగా జిల్లా సరిహద్దుల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించి వీటి నివారణకు గ్రామ స్థాయిలో విజిలెన్స్ సెక్యూరిటీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయించారు. ఇందులో ఎక్కువగా యువతను భాగస్వామ్యం అయ్యేలా చూస్తున్నారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దొంగతనాలు, నేరాల నియంత్రణ చేపట్టాలని చూస్తున్నారు. ఇలా ఎస్పీ తనదైన వ్యవహారశైలిలో పోలీసుశాఖలో ప్రక్షాళనతో పాటు కొత్త సంస్కరణలను చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో.. మూడుకు చేరిన మృతుల సంఖ్య



మృతులు వెంకటేష్, నవీన్, గణేష్ (ఫైల్)

పెద్ద కొడప్‌గల్, జూలై 3: మండలంలోని జగన్నాథ్‌పల్లి శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. బుధవారం రాత్రి జుక్కల్ మండలం మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన పానుగంటి వెంకటేష్(21), మంగలి గణేష్ (19), బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన నవీన్(21)లు మోటార్ సైకిల్‌పై పెద్ద కొడప్‌గల్ నుంచి జగన్నాథ్‌పల్లి వైపు బయలు దేరారు. ఈ క్రమంలో అంతకు ముందే జగన్నాథ్‌పల్లి శివారులో బొలెరో వాహనం బోల్తాపడింది. దీనిని సరిచేసే క్రమంలో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఇది గమనించని యువకులు మోటార్ సైకిల్‌పై వేగంగా వెళుతూ రహదారి పక్కన ఆగి ఉన్న కంటెయినర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో నరేష్, పానుగంటి వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన గణేష్‌ను పోలీసులు చికిత్స నిమిత్త నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇద్దరూ మృతి చెందగా, చికిత్స కోసం తరలిస్తుండగా మరొకరు మృతి చెందడంతో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ప్రమాదంలో మృతి చెందడంతో మహమ్మదాబాద్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య పట్టించుకోవడం లేదని భర్త ఆత్మహత్యా యత్నం

బీర్కూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామానికి చెందిన లక్కపల్లి భీంరావు అనే వ్యక్తి భార్య తనను సరిగ్గా పట్టించుకోవడం లేదని మనస్థాపం చెందాడు. గురువారం గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్ పైకి ఎక్కాడు. అక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ అమృ ఘటనా స్థలానికి చేరుకున్నారు. భీంరావుతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తానని చెప్పి కిందికి దింపారు. అనంతరం భీం రావుకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. గత కొన్ని రోజులుగా భీంరావుకు తన భార్య లక్ష్మీతో గొడవలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భిక్కనూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎంఎస్ఎన్ ఫార్మా సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గ్రామానికి చెందిన రాంచందర్ (52) ఎంఎస్ఎన్‌లో విధులు ముగించుకుని భిక్కనూరుకు వెళ్లి తిరిగి వెళ్తుండగా ఎంఎస్ఎన్ కంపెనీ సమీపంలో తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే చేరుకున్న ఎస్సై గాయపడిన రాంచందర్‌ను కామారెడ్డికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రామారెడ్డి పాఠశాలలో ఉపాధ్యాయుల విందు

రామారెడ్డి, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలో గిద్ద గ్రామంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు గురువారం నిబంధనలకు విరుద్ధంగా విందు ఏర్పాటు చేసుకున్నట్లు వెలుగు చూసింది. గిద్ద ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడి భార్య జన్మదినం సందర్భంగా ఆ పాఠశాలలోనే కేక్ కట్ చేసి చికెన్ వంటకాలతో విందు నిర్వహించుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై పలువురు మండల విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డీఈవో రాజును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తనకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు. ఫిర్యాదు అందితే విచారణ చేపడతానన్నారు.

నెమలి ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమలి ఆలయంలో గురువారం భక్తులు సాయి ఆలయాన్ని దర్శించుకున్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ నెమలి సాయి ఆలయం మినీ షిరిడీగా అవతరించిందన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కేజీవీల్స్ బీటీ రోడ్లపై నడిపితే రూ.25వేల జరిమానా



తిప్పాపూర్‌లో ఏకగ్రీవ తీర్మానం చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లు

తిప్పాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా తీర్మానం

భిక్కనూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): రోడ్లు చెడిపోతే మాకేంటని అనుకోకుండా గ్రామంలోని రోడ్లు పాడుకాకుండా గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో గ్రామస్థులంతా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బీటీ రోడ్లపై కేజీవీల్స్ నడిపితే జరిమానా విధించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని ట్రాక్టర్ యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీడీసీ అధ్యక్షుడు సిద్ధరాములు, రెడ్డి సంఘం అధ్యక్షుడు తిరుపతి భీంరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో ట్రాక్టర్లు కేజీవీల్స్‌తో బీటీ రోడ్లపై నడపి ఇటీవల నూతనంగా వేసిన, పాత బీటీ రోడ్లను పాడు చేయవద్దని, కేజీవీల్స్ నడపటంతో రోడ్లు పాడవడంతో పాటుగా వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తడం, ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. ఒకవేళ వీడీసీ నిబంధనలను పాటించకుండా కేజీవీల్స్‌ను బీటీ రోడ్డుపై నడిపితే రూ.25వేల జరిమానా విధించడంతో పాటుగా పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ మేరకు గ్రామస్థులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కుంట లింగారెడ్డి, ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లు, వీడీసీ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - కన్నప్ప
ప్రియా 70 - 8 వసంతాలు
ప్రియా 35 - కుబేరులు

బాన్సువాడ

మహేశ్వరి - కుబేర
వెంకటేశ్వర - కన్నప్ప

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

